వనితాలోకం :

ఆడవాళ్లు అనుమానం మనుషులా?

మ. రుక్మిణీగోపాల్

అప్పుడే మావారు కాఫీత్రాగి ఆఫీసుకు వెళ్ళారు. వంట ప్రారంభిద్దామనుకుంటూ, కత్తిపీటమీద కూర్చుని కూరలబుట్ట ముందుకు లాక్కున్నాను. వీధి తలుపు చప్పుడైంది. వెళ్ళి తలుపుతీశాను. ప్రక్క వాటాలోని కామాక్షమ్మగారు లోపలికొచ్చింది. వస్తూనే "మేడమీది వాటాలోకి కొత్తగా దిగారండోయ్. మీరు చూశారా?" అంది, అదోలా మొహం పెట్టి. నేనేమీ పట్టించుకోనట్టు 'లేదు'న్నాను. అంత నిర్లిప్తత ఆవిడకి నచ్చలేనట్టుంది. ఏం మనిషి అన్నట్టు ఒకసారి చూసి—

"నిన్న సాయంత్రమే దిగారు. కొంచెం కనుచీకటి పడిందేమో ఎవరో పోల్చుకోలేక పోయాను. కాని పొద్దున్న స్పష్టంగా చూశాను" అంది ఆగుతూ...

నాకీ సంభాషణ అంతా అనవసరమనిపించింది. మేడమీది వాటాలోకి ఎవరు దిగితే మాత్రం ఈవిడ కెందుకో, అనుకున్నాను. ఆవిణ్ణి నిరుత్సాహపరచటం ఇష్టంలేక "మీ కెరుకదు కేవిటి వారిని" అని అడిగాను.

ఇంతసేపటికి సరైన ప్రశ్న వచ్చినట్టు ఆవిడముఖం వికసించింది. "అయ్యో, ఎరక్కపోవట మేవిటి? పేటలో ఉన్నప్పుడు వీళ్ళు మా పక్కవాటాలోనే ఉంటూ ఉండేవారు. ఆవిడపేరు సరస్వతి" అని కొంచెం నవ్వింది; ఏదో గ్రంథమున్నట్లు. నాకు చిరాకు వేసుకొస్తోంది. చెప్పేదేదో పూర్తిగా చెప్పక మధ్యమధ్య ఆగటమెందుకో! కొందరికి అదో సరదా, మాటమాటకి 'అడిగించుకుంటే' కాని ఏ విషయం పూర్తిగా చెప్పరు.

"అయితే ఆవిడకూ, మీకూ చాలా స్నేహమే ఉండిఉంటుంది" అన్నాను.

కామాక్షమ్మగారి మూతి మూడు వంకరలు తిరిగింది.

"ఆ, స్నేహాని కేంలోటు" అంటూ కొంచెం దగ్గరికి వచ్చి, నెమ్మదిగా "ఆవిడ వట్టి అనుమానం మనిషండీ. ఇరుగు పొరుగు ఆడవాళ్ళని తిటిపోస్తుంది. ఒకరోజు ఆయన ఆఫీసునుంచి వచ్చేసరికి నేను వీధి గుమ్మంలో నుంచున్నానని, పిల్లిమీదా ఎలకమీదా పెట్టి ఎన్ని తిట్టిందో! అప్పటినుంచి వాళ్లింటికి వెళ్ళటం కాని, ఆవిడతో మాట్లాడటం కాని మానుకున్నాను. ఆయన చాలా పెద్దమనిషి. వంచిన బుర్ర ఎత్తడు. పెళ్లాం నోటికి దడుస్తాడు."

చెప్పవలసిందంతా చెప్పి కర్తవ్యం ముగించుకున్నట్టు నిలబడింది కామాక్షమ్మగారు.

అప్పటికిగాని నాకు తటవేలేదు, ఇంటికి వచ్చిన పెద్దమనిషిని కూర్చోమనలేదని.

"కూర్చోండి కామాక్షమ్మగారు, నుంచునే ఉన్నారు" అన్నాను.

"ఇంట్లో బోలెడంత పని ఉందమ్మా. ఇప్పుడు కూర్చునేందుకు కూడా తీరుబడి ఎక్కడ? మీతో ఈమాట చెప్పిపోదామని వచ్చాను. ఆవిడ విషయంలో జాగ్రత్తగా ఉండండి." అంటూ వెళ్ళిపోయింది. ఆవిడ పరోపకారబుద్ధికి నాకు నవ్వు వచ్చింది. వీధి తలుపు గడియ పెట్టి మళ్ళీ కత్తిపీటమీద కూర్చున్నాను.

నా దృష్టి అంతా ఆ సరస్వతిమీదే నిలిచింది. నాకిలాంటి అనుమానపు స్వభావం ఉన్నవాళ్ళను చూస్తే చాలా చిరాకు. ఇటువంటివాళ్లు నలుగురితో సరదాగా మెలగలేక అనవసరమైన అపోహలతో కుమిలిపోతూ, తమలో తాము దహించుకుపోతూ, ఉంటారని నా ఊహ. అదేమాదిరి భావం ఈ సరస్వతిమీద కూడా కలిగింది. కాని ఈమాటు నా ఆలోచనలు వేరుగా కొత్త పంథాలో నడవటం మొదలెట్టాయి. ఇటువంటివాళ్లను సంస్కరించేందుకు ఉపాయం లేదా? అని ఆలోచించాను. ఇలాంటి భార్యతో ఆ భర్త ఎంత ఇబ్బంది పడుతున్నాడో, అన్న ఆలోచన ఆ క్రొత్త వ్యక్తిమీద ఒక రకమైన అభిమానాన్ని నాలో కలగజేసింది. మధ్యాహ్నమే వెళ్ళి ఆవిడతో పరిచయం చేసుకోవాలనుకున్నా. ఎలాగైనా ప్రయత్నించి ఆవిడ అపోహ మాన్పించి, ఆవిణ్ణి ఒక కొత్త వెలుగులోకి తీసుకురావాలని నిశ్చయించుకున్నా. ఆవిణ్ణిగురించి ముందుగానే తెలిపి కామాక్షమ్మగారు చాలా ఉపకారం చేసిందనుకున్నా. ఇటువంటి తొందరపాటు స్వభావం గలవాళ్ళు కూడా సంఘానికి ఒక రకంగా సహాయపడతారని ఈనాడు గ్రహించాను.

మధ్యాహ్నం మేడమీది వాటాలోకి వెళ్ళాను. సరస్వతే వచ్చి తలుపు తీసింది. నన్ను చూడగానే మొదట కొంచెం తెల్లబోయింది. కాని సంబాళించుకుని "రండి, కూర్చోండి" అంది, మూలనున్న చాప తీస్తూ. మనిషికంఠంలో కొద్దిగా కర్కశత్వం ఉంది.

"మేము ఈ కింది వాటాలోనే ఉంటున్నాం.. నిన్న సాయంత్రమే వచ్చారనుకుంటాను." అన్నాను కూర్చుంటూ.

"అవునండి, నిన్న సాయంత్రమే వచ్చాం" అంటూ ఇంకేమి మాట్లాడాలో తెలియనట్టు ఒడిలో చంటిపిల్లాడి జుట్టు నిమురుతూ ఊరుకుంది.

నేను మనిషిని కొంచెం పరకాయించి చూశాను. మనిషి తెల్లగా ఉంది. లావు కాకుండా సన్నం కాకుండా, పొడుగూ కాకుండా, పొట్టి కాకుండా మధ్యరకంగా ఉంది. కళ్ళు పెద్దవే అయినా కాంతిహీనంగా ఉన్నాయి. మొహంలో కొంచెం కాఠిన్యం ఉంది. అది ముఖచ్ఛాయలో మోటుతనం కాదు; స్వభావం చేత కలిగిన కాఠిన్యంలా ఉంది. అన్నిటికంటె కొద్దిగా ఉంగరాలు తిరిగిన ఆమె పెద్ద జుట్టు ఆకర్షణీయంగా ఉంది. వయసు పాతికేళ్లకు మించనిదానిలా ఉంది. పిల్లల తల్లి కావటంతో ఉండవలసినంత నాజూకుతనం లేదు. ఏమైనా తగినవిధంగా అలంకరించుకుంటే ఆకర్షణీయంగానే ఉంటుందనిపించింది. హఠాత్తుగా ఆవిడ మొహం ఎత్తి చూసింది. నా చూపులు ఆవిడ మొహంమీంచి కిందికి దిగాయి. ఇంతవరకు ఏం మాట్లాడకుండా ఆవిణ్ణి పరికిస్తూ కూర్చున్నందుకు నాకే సిగ్గేసింది.

15 జ్యూయల్సు రిస్టువాచి రు. 5/-



ఇది 15 జూయల్సు రిస్టువాచి అందానికి గట్టికి 15 సం॥లు గ్యారంటీ దీనితో ఒక ఫౌంటెన్ కలం ఇవ్వబడును ఖరీదు రు. 5/-లు. వెంటనే ఆర్డరు ఇవ్వండి.

SWISS WATCH SUPPLIERS
(A P M) Lal Kuam. Delhi.

"ఎంతమంది పిల్లలు?" అడిగాను.

"ముగ్గురు."

మళ్ళీ ఆవిడ బుర్ర వంచుకుంది. ఇలాగ ఒక్కతీసే ఎంతసేపు మాట్లాడగలనో నాకర్థం కాలేదు. కొత్తవాళ్ళతో మాట్లాడటం నాకసలు చాతకాదు. ఏదో విధమైన ఆకర్షణ నన్నిలా ఈడ్చుకొచ్చింది.

"మీ రీ ఊరొచ్చి ఎన్నాళ్లయింది?" అన్నాను.

"రెండేళ్ళయింది."

మళ్ళీ మౌనం. నాకు చిరాకెత్తుకొచ్చింది. ఇనప గుగ్గిళ్లు కాని అనపగుగ్గిళ్లు కావు అనుకున్నాను.

"మీరు కొత్తగా వచ్చారంటే చూదామని వచ్చాను. వెడతాను. పనుంది. మా యింటికి కూడా ఒకసారి రండి." అంటూ వచ్చేశాను. నేను వచ్చేటప్పుడు కూడ ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

అనుకున్నాను కాని మూడో నాడు మధ్యాహ్నం సరస్వతి మా యింటికి రావటంతో ఆశ్చర్యపోయాను. ఒక విధమైన సంతోషంతో ఆహ్వానించాను. మొదటి రోజుకంటె బాగానే మాట్లాడింది. ఆరోజు అలా ఎందుకు ప్రవర్తించిందో నాకర్థం కాలేదు. తన అత్తవారినిగురించి, పుట్టింటి వారినిగురించి ఏవేవో చెప్పింది. కాని భర్త మాట మాత్రం ఎక్కడా రానివ్వలేదు. ఈ ప్రవాహంలో ఆ వ్యక్తిని గురించి ఒక్క మాటన్నా దొర్లకుండా ఉంటుందా అనుకున్నా. కాని ఆ విషయంలో మాత్రం ఆవిడ చాలా జాగ్రత్తగా ప్రవర్తించింది.

అక్కడనుంచి మేము తరుచు కాకపోయినా, అప్పుడప్పుడు కలుసుకుంటూ ఉండేవాళ్ళం. ఆవిడ నాతో బాగానే మాట్లాడేది. నేను కూడా ఆవిడ స్వభావాన్నిగురించి మొదటే తెలుసుకున్నాను కాబట్టి ఆయన లేని వేళలో మాత్రమే వారింటికి వెడుతూ, నామీద ఎటువంటి చెడ్డ అభిప్రాయం కలగకుండా ఉండేందుకు ప్రయత్నించేదానిని. నే నెవరింట్లోను ఎక్కువగా వెళ్ళనని, అందరితో స్నేహం కలుపుకోనని పేరుంది. ఒకవిధంగా అది నిజమే కూడాను. కాని ఈవిడతో ఇంత ఆత్మీయత ఎందుకు కలిగిందో అర్థంకాదు. కామాక్షమ్మగారికి మాత్రం మా స్నేహం నచ్చలేనట్టుంది. సరస్వతితో స్నేహం, నన్ను ఆవిడనుంచి దూరం చేస్తున్నట్టు భావించసాగింది. ఆ భావం చూపులలోను సూటిపోటు మాటలలోను వ్యక్తపరిచేది. నే నేమీ పట్టించుకునేదాన్ని కాను.

క్రమంగా సరస్వతికి కూడా నేనంటే ఒకవిధమైన గౌరవం ఏర్పడుతోందని గ్రహించాను. ముఖ్యంగా ఆయన కంటబడకుండా ఉండేందుకు నేను చేసే ప్రయ

'అనాసిన్'

నాలుగు మందులను కలిగియున్నది.

అనాసిన్ నాలుగు మందులయొక్క వైజ్ఞానిక మిశ్రమము ఇది నరముల ముఖ్య స్థానములందు తీవ్రమైన మిశ్రమచర్యను జరిపి, నొప్పి, తలనొప్పి, జలుబులు, జ్వరం, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రవిముక్తిని కలిగించును.

1. క్వినైన్: అధిక శక్తి నిచ్చు మరియు జ్వరనివారణ మొనర్చు గుణాలకు ప్రఖ్యాతి గాంచినది, జ్వరాన్ని తగ్గించడంలో మిక్కిలి శక్తిగలది.
2. కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.
3. ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారణి జ్వర నివారణియని ఖ్యాతిచెందినది.
4. అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: తలనొప్పి, మరియు అలాటి బాధలను పోగొట్టుటకు మిగుల ఉపయుక్తమైనది.

ఈ నాలుగు మందులు సరిగ్గా వైద్యునియొక్క ఔషదయోగము వలె పనిచేయును 'అనాసిన్' గుండెకు హాని కలిగించదు, లేక కడుపును అవకతవకలు చేయదు. నొప్పి, తలనొప్పి జలుబులు, పన్నునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రంగా సురక్షితమైన మరియు రూఢియైన విముక్తికొరకు ఎల్లప్పుడూ 'అనాసిన్'నే వాడండి.



లక్షలాది మందికి బాధావిముక్తిని కలిగించును

A.43

స్నానాలు, ఆవిడ్ని ఎక్కువగా ఆకర్షించేది అనుకుంటాను. "చదువుకున్నవారైనా మీ పద్ధతి వేరండి. ఇప్పటికాలంవాళ్లకి మొగాడంటే అసలు గౌరవంలేదు. ఎదురుగా వస్తుంటే పక్కకి తప్పుకోనన్నా తప్పుకోరు" అనేది. నేను నవ్వి ఊరుకునేదాన్ని. నేనంటే ఆవిడకు గురి కుదిరినందుకు లోలోపల సంతోషించేదాన్ని. కామాక్షమ్మగారు చెప్పిన విషయం ఆమెలో నాకెప్పుడూ గోచరించలేదు. కొందరు వ్యక్తులు ఇతరులనుగురించి చెడ్డగా చెప్పుకుని సంతోషిస్తారేమో అనుకున్నాను.

ఆయనకూడా చాలా పెద్దమనిషిలా కనిపించాడు. వంచిన బుర్ర ఎత్తేవాడు కాదు. ఈ విషయంలోమట్టుకు కామాక్షమ్మగారు చెప్పింది అక్షరాలా నిజమయింది. మా వీధిగదిలోంచే పైకి వెళ్లటానికి మెట్లున్నాయి. అక్కడే ఆయన తన సైకిలు పెట్టుకొనేవాడు. ఆయన సైకిలు తీసుకుందుకు వచ్చే టైముకు నేనెప్పుడైనా అక్కడున్నానంటే, నే వెళ్ళిపోతేకాని పూర్తిగా మెట్లు దిగేవాడు కాదు. ఏ సాయంత్రం వేళైనా నేను దొడ్లో కూర్చున్నప్పుడు, ఆయన డాబామీదికి రావటం తటస్థిస్తే, నన్ను చూసి వెనక్కి వెళ్ళిపోయేవాడు. ఇటువంటి వ్యక్తినిగురించి, ఆవిడ అలాంటి అభిప్రాయం ఎలా పడేదో నాకర్థంకాలేదు.

ఓరోజు సరస్వతి ఇంట్లోంచి పెద్దపెద్దగా కేకలు వినపడ్డాయి. అది సరస్వతి గొంతుకే. మధ్యమధ్య పనిమనిషి సణుగుడుకూడా వినపడింది. ఏదో పనిదగ్గర పేచీ వచ్చింది కాబోలు, అనుకున్నాను. ఇంతలో పనిమనిషి కళ్లు తుడుచుకుంటూ వచ్చి "కాఫీ గిన్నె లెయ్యండి అమ్మగారూ" అంది. మాకు పనిచేసేదే సరస్వతి ఇంట్లోకూడా చేస్తోంది. కాని కళ్ళు ఎరుపుదనం చూసి 'ఏం జరిగిందో' అని అడగకుండా ఉండలేకపోయాను.

"సూడండమ్మగోరూ, నే నేమన్నా మొగాడికోసం మొహం వాచిపోయానా? అయ్యగారు లోపల ఉన్నారని తెలీక గది ఊడవటానికి వెళ్ళాను. అది తప్పొచ్చింది ఆ అమ్మకి. నానా మాటలూ అంది. నా మొగోడు అసలే మంచోడు కాదు. ఇంటే సంపేత్తాడు" అంటూ మళ్ళీ ఇంకోసారి కళ్లు తుడుచుకుంది.

"అయ్యగారు ఉన్నట్టు నాకు తెలవక వెళ్లానమ్మా, తెలిస్తే వెళ్ళకపోదును—అని చెప్పలేకపోయావుటే" అన్నాను.

"సెప్పినానమ్మా. ఆ యమ్మ ఇనిపించుకుంటేగా, ఆ యమ్మదోరణి ఆ యమ్మదే" అంటూ గిన్నెలు తీసుకు పెరట్లోకి వెళ్ళిపోయింది.

ఇన్నాళ్ళకు కామాక్షమ్మగారు చెప్పిన దాంట్లో కొంతైనా నిజం లేకపోలే దనిపించింది. ఈ పనిమనిషిస్వభావం నాకు బాగా తెలుసు. ఇటువంటి విషయాన్ని గురించి నాకెప్పుడూ అనుమానం అనిపించలేదు. ఈ చుట్టుపక్కల చాలా ఇళ్లలో పని చేస్తోంది కాని ఎప్పుడూ ఇలాంటి గొడవ జరగలేదు. ఈవిషయంలో కేవలం సరస్వతి అపోహపడిందనే అనుకోవాలి. కాని ఆవిడ ఇటువంటి అపోహపడటానికి ఆధారం ఏముందో నాకెంత ఆలోచించినా దొరకలేదు. పోనీ, మొగుడైనా అల్లరి చిల్లరివాడా అంటే అదీలేదు. ఇంక ఇది కేవలం ఆవిడ మూర్ఖత్వం తప్ప విడిచి మరేంకాదని నాకు తోచింది. ముఖ్యంగా అటువంటి ఉత్తముడైన భర్తనుగురించి ఆవిడ ఇలా దురభిప్రాయపడటం నాకెంత మాత్రం నచ్చలేదు. ఎలాగైనా ఆవిడ బుర్రని ఇటువంటి కుళ్ళులోంచి బయటికి లాగాలనుకున్నాను. ఇంతవరకూ ఏమనుకుంటుందో అని ఈ విషయం ఆమెదగ్గర ఎప్పుడూ ఎత్తలేదు. అయినా తరుణంకూడా ఎప్పుడూ చిక్కలేదు. ఇప్పుడు ఈ వంకని ఒకసారి తప్పకుండా కదపాలనుకున్నాను.

ఆ మధ్యాహ్నమే సరస్వతి మా యింటికొచ్చింది. కొంతసేపు ఏవో అవీ ఇవీ మాట్లాడుకున్నాం. ఇంక ఈ విషయం కదుపుదామనుకుంటున్నాను. ఇంతలోకే సరస్వతి అంది. "ప్రొద్దుట మా ఆడబిడ్డకు పురుడు వచ్చిందట. మా ఆడబిడ్డగారు ఈ ఊళ్లో ఉన్న సంగతి మీ కిదివరకే చెప్పాననుకుంటాను. పొద్దుట కబురు తెలిస్తే మా ఆయన వెళ్ళి చూసొచ్చారు. 'పిల్లలు ఒక్కళ్లూ తంటాలు పడుతున్నారు, వదిన్ని పంపు' అని చెప్పిందట మా ఆడబిడ్డ. సాయంత్రం బయలుదేరి వెళుతున్నాను. ఈ పది రోజులూ ఉండి నీళ్ళుపోసి తిరిగొస్తాను. ఈ సంగతి మీతో చెప్పిపోదామని వచ్చాను" అంది.

సరే ఇప్పుడా గొడవ తేవటం ఎందుకు, వెళ్ళొచ్చిన తరువాతనే కదపొచ్చని ఊరుకుని "అలాగే వెళ్ళిరండి" అన్నాను. ఆ సాయంత్రమే సరస్వతి వెళ్ళినట్టు పనిమనిషి చెప్పింది.

ఆరోజునుంచి మావారికి రాత్రి డ్యూటీ పడింది. త్వరగా భోజనం తెముల్చుకుని ఆయన వెళ్ళిపోయారు. నేను కూడా భోజనం పని ముగించుకుని కాలక్షేపానికి ఒక పత్రిక తీశాను. వీధితలుపు చప్పుడైంది. ఈ వేళప్పుడు వచ్చేవాళ్లెవరా అనుకుంటూ తలుపు తీశాను. గుమ్మంలో ఉన్న వ్యక్తిని చూసేసరికి నా ఆశ్చర్యానికి అంతులేకపోయింది. సరస్వతి మొగుడు! ఏమనాలో అర్థంకాక అలా చూస్తూ ఉండిపోయాను.

"కొంచెం మంచినీళ్లు పోస్తారా? ఇవాళ పనిమనిషి మంచినీళ్లు తీసుకురాకుండా వెళ్ళిపోయింది." అంటూ చేతిలో మర చెంబు పట్టుకుని ఒకడుగు ముందుకు వేశాడు. నా అనుమానానికి నాకే సిగ్గేసింది. అసలు ఆడజాతే ఇంతేనేమో అనిపించింది. గుమ్మంలోకొచ్చిన పెద్దమనిషిని ఏం కావాలనైనా అడగలేదు.

"అలాగే, కూర్చోండి, పట్టుకొస్తాను" అంటూ లోపలికి వెళ్లి, చెంబుతో నీళ్లు తెచ్చి ఆయన చెంబులో పోశాను. ఆయన వెళ్లటానికి లేవలేదు. అలాగే కూర్చుని కొంచెం తటపటాయిస్తూ "మీతో ఒక విషయం చెప్పుదామని వచ్చాను. మీ కభ్యంతరం లేకపోతే కొంచెం ఆ తలుపేస్తారా?" అన్నాడు పూర్తిగా, నా ముఖంవంక చూడకుండా. మళ్ళీ నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను. ఆయనకు నాతో చెప్పవలసిన రహస్యం ఏముందా అని ఆలోచించాను. నా బుర్ర కొంచెం వేగంగా పనిచెయ్యటం మొదలెట్టింది. బహుశా భార్యవిషయంలో ఏమైనా చెప్పి, నా సలహాకాని, సహాయం కాని కోరతాడేమో అనుకున్నాను. ఈ సమయంలో ఆయన్ని అనుమానించటం నామీద నాకు నమ్మకం లేకనా, అనిపించింది. ఏమైనా ఆయన చెప్పే విషయమేదో తెలుసుకోవాలనే కుతూహలంతో తలుపు వెయ్యటానికి వెళ్లాను. తలుపు వేయబోతూ అకస్మాత్తుగా వెనుదిరిగి చూశాను. ఆయన నాకు చాలా సమీపంలో నుంచున్నాడు. ఆయన రెండు చేతులూ నా నడుమును చుట్టివేసే ప్రయత్నంలో ఉన్నాయి. కళ్ళు కామంతో నిండిపోయి ఉన్నందుకు చిహ్నంగా ఎర్రబారి ఉన్నాయి. ఒక్కసారి తలుపులు రెండూ బార్లా తీసేసి బయటికి పరుగెత్తాను. భయంతో వణికిపోతున్నాను. గుండెలు దడదడ కొట్టుకోసాగాయి. భయం, కోపం, అసహ్యంతో నా హృదయం నిండిపోయింది. "వెళ్ళిపోతారా, నలుగుర్నీ కేకెయ్యమంటారా?" సాధ్యమైనంత గట్టిగా అన్నాను. "క్షమించండి, వెళ్లిపోతాను. మీ స్వభావం ఎలాంటిదో తెలియక పొరపాటు చేశాను." అంటూ మరచెంబు తీసుకుని వంచిన బుర్ర ఎత్తకుండా వెళ్ళిపోయాడు. బ్రతుకు జీవుడా అనుకుని లోపలికి పోయి తలుపు బిగించుకున్నాను. నా వణుకు ఇంకా తగ్గలేదు కాని నా ఆశ్చర్యానికి అంతులేకపోయింది. నేను ప్రతిరోజూ చూసే వ్యక్తేనా ఈ వ్యక్తి అనిపించింది. ఇటువంటి భర్తల విషయంలో భార్యలు అనుమానపడితే తప్పా? ఆడవాళ్లు అనుమానంమనుషులని చటుక్కున అనేస్తారు. భర్త స్వభావం ఎరిగున్నది కాబట్టే సరస్వతి ఆయన విషయంలో అలా ప్రవర్తించేది. అది తెలుసుకోలేక ఈ నివురుగప్పిన నిప్పును చూసి ఆవిణ్ణి ఆడిపోసుకుంటుంది లోకం! ★